సత్యానందం ఓ గవర్నమెంటాఫీసులో అకౌంట్స్ ఆఫీసర్. ముగ్గురు కొడుకులు, ఒక కూతురు సంతానం.

ఆడవాళ్ళకు చదువు అనవసరం అని అమ్మమ్మ అనడంతో కూతురిని బడికి పంపే ఉద్దేశ్యాన్ని మానుకున్నాడు. ఇక చదివించాల్సింది కొడుకులనే.

స్కూల్లో పడేయాల్సిన వయస్సొచ్చింది పెద్దాడు శీనుకి.

సత్యానందం తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు. శీనుని ప్రగతి రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించాలి. గవర్నమెంట్ స్కూలు. శ్రద్ధతో చెబుతారు. తిండి ఖర్చుండదు. పైగా స్కాలర్‌షిప్‌లు...రిజర్వ్‌డ్ సీట్లు తొంభై శాతం కనుక సీటు వచ్చి తీరుతుంది. ఆ నమ్మకంతోనే ఎంట్రన్స్ వ్రాయించాడు.

సీటొచ్చింది పరీక్ష గొప్పగా వ్రాసేయకపోయినా.

వంద సీట్లకి వేల సంఖ్యలో అప్లికేషన్లొచ్చాయి. ఎందరో పేద విద్యార్థులు నిరాశ చెందారు తమకి సీటు రానందుకు.

'శీను'కి సీటు రావడంతో చాలా రిలీఫ్ ఫీలయ్యాడు



సత్యానందం. ఇక శీను చదువు గురించి ఆలోచించాల్సిన పనిలేదు. పుస్తకాలు, దుస్తులు, ఒకటేమిటి అన్ని ఖర్చులూ ప్రభుత్వానివే. వాళ్ళు బాగా చదివేలా చూసే బాధ్యత ప్రభుత్వానిదే. చదువయ్యాక వాడు డాక్టరా... ఇంజనీరా లేక కలెక్టరా తరువాత ఆలోచించుకోవచ్చు.

అయితే ఒక్క విషయం మర్చిపోకూడదు తను. శీను తండ్రి తను కాదు. శీనుకి తండ్రి లేడు. గార్డియన్‌గా వీరిగాడు వేలిముద్రేశాడు అప్లికేషన్‌లో.

ఎందుకంటే అప్లై చేయాలంటే సత్యానందం వార్షికాదాయం ముప్పై కాదు నలభైవేలు కూడా దాటేసింది...అందుకు.

'కాగితం మీద వ్రాయనంత మాత్రాన కన్న కొడుకు కొడుకు కాకుండా పోతాడా-పిచ్చి ప్రభుత్వం' అనుకున్నాడు.

లాగి వదిలిన సిగరెట్ పొగ గాలిలో రింగులు తిరిగి పల్టీలు కొడుతోంది.

— మంత్రవాది మహేశ్వర్

## టెక్నిక్

మూర పావలా... అంటూ ముగ్గురు మల్లెపూలు అమ్మేవాళ్ళు అమ్ముతున్నా ఒక అతను మాత్రం మూర అర్ధ రూపాయ్ అంటూ అమ్ముతుండడం ఓ ఫ్రెండ్ కోసం ఆ సెంటర్‌లో ఎదురు చూస్తున్న నా దృష్టిని ఆకర్షించింది.

అది ఫస్ట్ షో విడిచే సమయం కావడంతోను పైగా అది రెండు సినిమాహాళ్ళు కలిసే కూడలి కావడంతోను జనం కాస్త రద్దీగా వున్నారు.

మూర పావలా... లెక్కన అమ్ముతున్న ముగ్గురు తమ బుట్టల్ని ఖాళీ చేసుకొని వెళ్ళిపోయారు. కానీ మూర అర్ధ రూపాయ్ లెక్కన అమ్ముతున్న అతను మాత్రం అలాగే అమ్ముతున్నాడు. ఇంతలో రెండవ సినిమా హాలులో కూడా పిక్చర్ వదలడం, జనం రద్దీ పెరగడం ఈ మల్లె పూలమ్మే అతని బుట్ట ఖాళీ అయిపోవడం నాకు ఆశ్చర్యాన్ని మిగిల్చింది.

విషయమేమిటని పూలతన్ని అడిగాను.

"ఏముంది బాబూ! చిన్న చిట్కా. ముందు వదిలింది మాస్ సినిమా. ఇప్పుడు వదిలింది క్లాస్ సినిమా. పెద్దోళ్ళు గనక నేను ఎంత రేటు చెప్పినా వాళ్ళు గొప్ప కోసం కొన్నారు. అదే నాకు లాభం తెచ్చేది అనేసి వేడి



వేడిగా వెళ్ళిపోయాడు.

అతను టెక్నిక్‌తో చేస్తున్న వ్యాపారం నాకు కొంత స్ఫూర్తి నిచ్చింది.

—పార్లపల్లి సురేంద్ర

## సహారా హుషార్

ఈశ్వర్రావు గారు చాలా మంచివాడు - నాకు తెల్సున్నంతలో.

మరొకర్ని బాధపెట్టే రకం కాదు. తన పనేదో తాను చేసుకుపోయే మనస్తత్వం.


అన్నం ఉడికిందో లేదో తెలుసుకోడానికి ఒక్క మెతుకుని పట్టుకుంటే చాలు. అలానే ఒక మనిషి గురించి తెల్సుకోవాలంటే ఓ పది రోజులు అతన్ని పరిశీలిస్తే చాలు. ఈశ్వర్రావుగారి మెంటాలిటీని అలానే తెల్సుకోకలిగాను. క్రితంసారి స్పాట్ వాల్యుయేషన్ పది రోజులూ - వాళ్ళ పై అధికారిగా ఆయన్ని గమనించి తీర్మానించాను.

ఈ సంవత్సరం స్పాట్ వాల్యుయేషన్‌కి క్రితంసారి పిల్చిన వాళ్ళకే ఆర్డర్సు పంపించాం. అంగీకారం తెలుపమని రాశాం.

ఓ వారం రోజులు తిరిగేసరికల్లా - ఈశ్వర్రావుగారి దగ్గర్నుంచి మాత్రమే అంగీకార పత్రం వచ్చింది. మిగతా వాళ్ళందరి దగ్గర్నుంచీ 'ఆ ఈశ్వర్రావుగా రొస్తుంటే మేం రాము' అని వచ్చేయి.

వాళ్ళందరూ ఎందుకలా అంటున్నారో అర్థం కాలేదు నాకు. వాళ్ళందరూ మంచి సరదాగా గడిపేవారు 'ఎందుకు రానంటున్నారు?' అని పర్సనల్ ఇంట్రెస్ట్ పే చేసి ఉత్తరాలు రాశాను.

"అక్కడికి స్పాట్ వాల్యుయేషన్ నిమిత్తం రావడానికి ఈశ్వర్రావుగారే అడ్డు. అక్కడికి వచ్చిన అందరిచేతా ఆయన రాసిన పుస్తకాల్ని బలవంతంగా అంటకట్టేస్తున్నారు. కథలు, కవితలు అని ఏవేవో చెప్పి మెదడు తినేస్తూండేవారు. డి.ఎ., టి.ఎ.లు పోను మీరు మాకిచ్చే సొమ్ము ఆయన బలవంతంగా లాగేసుకుంటున్నారు.




సరదాగా పాత మిత్రులు అందరూ కల్సుకునే అవకాశం వుంటుందని అక్కడి కొస్తుంటే - అక్కడ అదీ మా పరిస్థితి. మీరు మరోలా అనుకోవద్దు-" కొంచెం తేడాలతో అందరి దగ్గర్నుంచీ అదేరకం ఉత్తరం!

—గోపరాజు రాధాకృష్ణ

ఓ కాలేజీ విద్యార్థిని
?
టీనేజ్ రీడర్స్ కోసం రాస్తున్న సీరియల్